# డిగ్నిటీ ఆఫ్ లేబర్

హైద్రాబాద్ కెళ్ళే బస్సు కోసం ఎదిరిచూస్తూ మాట్లాడుకుంటు న్నారు శేషు, శరత్. శంకర్. చేతిలో సూట్ కేస్‌తో వచ్చిన రాజు సూట్ కేస్ క్రిందపెట్టి వాళ్ళతో కలిసాడు. హైద్రాబాద్ కెళ్లే బస్సు రావ డానికింకో అరగంట పైనుంది—వాళ్ళు మాటల్లో ప్రపంచాన్నంతా చుట్టొచ్చి చివరకు ఉద్యోగాల విషయం దగ్గరకొచ్చి ఆగారు—

"నువ్వు వైట్‌కాలర్ మనిషివి... బేంకులో ఉద్యోగం... చేతినిండా డబ్బు" రాజు నుద్దేశించి అన్నాడు శేషు.

"ఇంటి పేరు కస్తూరోళ్ళు—ఇంట్ల గబ్బిలాల వాసనన్నట్టుంది. నా ఉద్యోగం. రోజు నాచేతుల్నుంచి వేలకొద్దిడబ్బుపోతుంది కాని మనజేబు లకొచ్చేది మాత్రం కేవలం జీతం డబ్బులే. పొద్దంతా లెక్కలతో సత మతం కావాలి. మీ పంతుళ్ళ పనే నయ్యం. ట్యూషన్లవీ చెప్పుకోవచ్చు అన్నాడు రాజు.

"బతుకలేనోడు బడిపంతులని అందరంటుంటే, టీచర్ ఉద్యోగాన్ని మెచ్చుకునెటోనివి నువ్వొక్కనివే దొరికినవు. టీచర్‌కు సోషల్ వ్యాల్యూ లేదు. పోగా ఎవ్వరికి కోపమొచ్చినా శంకరగిరి మాన్యాలు పట్టిస్తారు— క్లర్కు జేబునయం... ట్రాన్సఫర్లుండవు— పై అదాయముంటుంది" అన్నాడు శేషు... శేషు హైస్కూల్లో టీచర్.

"గుమాస్తాగిరిని మంచిదన్నోన్ని విన్నొక్కన్నే చూసిన—పై ఆఫీస ర్లకు చంచా కొడుతూ బ్రతకాలి... పై ఆదాయం మాటేమోకాని— పై వాళ్ళనుంచి చివాట్లయితే తప్పవు. ఎప్పటికీ గొర్రెతోక బెత్తెడ న్నట్టే ఉంటుందీ ఉద్యోగం— మనందరి కంటె శరత్‌పని నయం... ఫ్యాక్టరీలో ఉద్యోగం—మంచి జీతం... బోనస్ - ఓవర్‌టైమ్ మంచి

క్వార్టర్ మెడికల్ ఫెసిలిటీ, శరతే అదృష్టవంతుడు" అన్నాడు శంకర్.

"భలే చెప్పినవురా శంకర్? ఫ్యాక్టరీలో కార్మికుడుగా సుఖపడ్తున్నా ననుకుంటున్నావా—? షిఫ్టు డ్యూటీలు, సౌండ్ వాతావరణ పొల్యూషన్ తేల్ మాలిష్‌లు . ఛీ-ఛీ నాదేం ఉద్యోగం— అన్నాడు శరత్.

తమది మంచుద్యోగం కాదని ... ఎదుటివాళ్లే అదృష్టవంతులని వాదించుకుంటున్నారు వాళ్లు. బస్సొచ్చే టైమౌతుంది కాబట్టి సామాన్లు పైన వేయడానికీ మాట్లాడాలన్న ఉద్దేశ్యంతో దగ్గర్లోంచి పోతున్న కూలీనుద్దేశించి...

"అరేయ్—? ఇట్రా" అన్నాడు శంకర్.

కూలీ గుర్రుగా చూస్తూ వాళ్ళ దగ్గరకొచ్చి—

"ఏం సార్—మర్యాదగా పిలువగం చేతకాదా?" అన్నాడు.

"ముల్లెలు మోసే కూలోనివి నీకు మర్యాద కావల్సొచ్చిందా"? వ్యంగ్యంగా అన్నాడు శేషు. వాళ్ళ మధ్య ఘర్షణ పెరుగుంది.

చాలా సేపట్నుంచి ఆ నలుగుర్ని చూస్తూ. వాళ్ళ మాటలు వింటూ నిల్చున్న మరోకూలీ యువకుడు "ఆగండాగండి కొట్లాడొద్దు" అంటూ అక్కడికొచ్చాడు—

"ఇందాకట్నుంచీ నేను మీ మాటలు వింటున్నాను సార్.- మీకు మీరే చేసే ఉద్యోగాలు అంటే మీ కడుపులు నింపుతున్న వృత్తులపైన్నే గౌరవం లేదు—అలాంటప్పుడో కూలిపనోడికి మర్యాదిచ్చే సంస్కారం మీకెక్కడుంటుంది సార్—కూలిపని చేస్తున్నంత మాత్రాన హీనంగా చూడాలా సార్? బ్రతుకడానికి ఎన్నుకున్న ఏ వృత్తి హీనమైంది కాదు సార్—అన్ని వృత్తులను గౌరవించడం నేర్చుకోవాలి... మీ వృత్తులను మీరే నిందించుకుంటున్నారు. కాని మా వృత్తిని మేము హీనమైందనుకోవడం లేదు—పోగా వ్యూ ఆర్ ప్రౌడ్ ఆఫ్ అవర్ జాబ్— గివ్ రెస్పెక్ట్ అండ్ టేక్ రెస్పెక్ట్.. అనే ఆగాడాయువకుడు.

అతని మాటలు వింటున్న ఆ నలుగురి నోట్లోంచి ఒక్కమాట కూడా బయటకురావడం లేదు అతని మాటతీరు వాళ్ళకాశ్చర్యంగా ఉంది.

"నా మాటలు వింటుంటే మీకాశ్చర్యంగా వుంది కదాసార్? నేను చదువుకున్నోడిలా ఉన్నానని కూడా మీరనుకుంటున్నారనుకుంటాను— అవును సార్ నాపేరు రవికిరణ్ ఎమ్.ఏ,పొలిటికల్ సైన్స్ హైయ్యర్ సెకండ్ క్లాస్—అయినా నేనీ పనిచేయడానికి సిగ్గుపడటం లేదు. దీన్నే డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటారని మీకు తెలియదనుకుంటాను — అదుగో మీ బస్సొచ్చేసింది. ఎక్కండెక్కండి సామాన్లు పైన పెడతాను—" అంటూ వాళ్ళ సామాన్లు నెత్తిపై పెట్టుకొని బస్సు నిచ్చెనెక్కసాగాడు రవికిరణ్—

నేటికథ ఆంధ్రభూమి 28-2-89